మాట్లాడుతున్న గ్రామ పంచాయతీ స్పెషల్ ఆఫీసర్ వీరభద్రరావు

పరిశుభ్రత పాటించాలి

డోర్నకల్, సెప్టెంబర్ 19 : పరిసరాల పరిశుభ్రతను పాటించాలని గ్రామ పంచాయతీ స్పెషల్ ఆఫీసర్ వీరభద్రరావు అన్నారు. గురువారం చిల్కోడుగ్రామంలో 'స్వచ్ఛతా హీ సేవ' కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కృష్ణ ప్రసాద్, అంగన్ వాడీ టీచర్లు రాధిక, కళావతి, సిబ్బంది పాల్గొన్నారు.

మరిపెడలో..

మరిపెడ, సెప్టెంబర్ 19: ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రతను పాటించాలని పీహెచ్‌సీ వైద్యాధికారి రవికుమార్ సూచించారు. మున్సిపల్ కేంద్రంలోని మరిపెడ గ్రామంలో జన వికాస, శ్రీసత్య లయన్స్ కంటి వైద్యశాల చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేసి, 200 మంది గ్రామస్తులకు కంటి పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు లయన్‌రెడ్డి, బాలూనాయక్, మోహన్‌నాయక్, క్లస్టర్ ఇన్‌చార్జి శ్రీహరి, సరిత, నాగమణి, సాయిశ్రీ పాల్గొన్నారు.

పడమటిగూడెం పాఠశాల దగ్గర నిర్మిస్తున్న గద్దె

పడమటిగూడెంలో గద్దె పంచాయితీ

నర్సింహులపేట, సెప్టెంబర్ 19: మండలంలోని పడమటిగూడెం గ్రామంలో గద్దె పంచాయితీ పోలీసుల వరకూ వెళ్లింది. 20 ఏళ్లుగా వినాయక విగ్రహం ఏర్పాటు చేస్తున్న ప్రదేశంలో పార్టీలకతీతంగా ఒక వర్గం గద్దె నిర్మాణం చేస్తుండగా, పాఠశాల ప్రహరీ వద్ద నిర్మించొద్దని మరోవర్గం గొడవ పడుతున్నాయి. దీంతో అధికారులు నోటీసులు ఇవ్వడంతో గద్దె నిర్మాణ పనులపై గందరగోళం నెలకొంది. 'పై'చేయి' సాధించాలని అధికారులపై ఒత్తిడి చేయడంతో గురువారం ఎంపీవో యాకయ్య, ఎస్సై సురేశ్ గద్దె పనులు పరిశీలించి రెండు రోజులపాటు పనులు నిలిపేయాలని, తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు.

విద్యార్థులకు విద్యాసామగ్రి అందజేత

మరిపెడ, సెప్టెంబర్19 : మండలంలోనేఇ సీతారాంతండా, మరిపెడ ప్రభుత్వ పాఠశాలల్లో తెలుగు సమితి ఆఫ్ నేబ్రాస్కా, స్ఫూర్తి ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో గురువారం విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం భరత్, కృష్ణయ్య, ఉపాధ్యాయులు రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పలకలు నోట్‌బుక్‌లు అందిస్తున్న సంస్థ ప్రతినిధులు

అభ్యంతరాలుంటే 21లోపు తెలపాలి

రాజకీయ పార్టీ నాయకులతో అధికారుల సమావేశం

నెల్లికుదురు : పార్టీ నాయకుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో బాలరాజు

డోర్నకల్‌లోమాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీనివాసరావు

మహబూబాబాద్ రూరల్, సెప్టెంబర్ 19 : అర్హత గల ప్రతి ఒక్కరి ఓటు నమోదు చేయాలని ఎంపీడీవో రఘుపతిరెడ్డి సూచించారు. గురువారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో రాజకీయ పార్టీలతో ముసాయిదా ఓటరు జాబితాపై సమావేశాన్ని నిర్వహించారు. అభ్యంతరాలుంటే తెలపాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నుంచి మంగీలాల్ , రవి కుమార్, బీఆర్ఎస్ నుంచి తేళ్ల శ్రీను పాల్గొన్నారు.

దంతాలపల్లిలో..

దంతాలపల్లి : ఓటరు జాబితాలో తప్పులు, మార్పులు, చేర్పులుంటే దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో వివేక్‌రాం తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాయలంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ..ఓటరు లిస్టుపై ఆయా గ్రామాల ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఎంపీవో అప్సర్‌పాషా, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

పెద్దవంగరలో..

పెద్దవంగర : మండలంలోని అన్ని గ్రామాల ఓటర్ల జాబితాపై గురువారం మండలకేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో వేణుమాధవ్ వివిధ రాజకీయ పార్టీల నేతలతో సమావేశం నిర్వహించారు. జాబిలో అభ్యంతరాలుంటే తెలుపాలని సూచించారు.

నెల్లికుదురులో..

నెల్లికుదురు : ఓటరు జాబితా అభ్యంతరాలుంటే 21లోపు ఇవ్వాలని ఎంపీడీవో బాలరాజు అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో గురువారం పార్టీ నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో ఈ నెల 3న ఓటరు ముసాయిదా జాబితా విడుదల చేశామని తెలిపారు. అభ్యంతరాలుంటే 21వరకు ఇవ్వాలన్నారు.

గార్లలో..

గార్ల : ఓటరు జాబితా రూపకల్పనకు అన్ని పార్టీల రాజకీయ నాయకులు సహకరించాలని ఎంపీడీవో మంగమ్మ కోరారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ నెల 21లోపు అభ్యంతరాలు తెలుపాలని, 22న తుది జాబితాను ప్రకటిస్తామన్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ సుధాకర్, వివిధ పార్టీల నాయకులు గంగావత్ లక్ష్మణ్ నాయక్, శ్రీనివాసరావు, రామారావు, రాము గౌడ్, కృష్ణారెడ్డి, సక్రూనాయక్, దేవా, నాగేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కురవిలో..

కురవి : కురవి మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో గురువారం అన్ని రాజకీయ పార్టీల నాయకులతో ఎంపీడీవో వీరాబాబు సమావేశం నిర్వహించారు. ఆన్‌లైన్ ప్రకారం ఓటర్‌లిస్టును పంచాయతీల్లో ప్రదర్శించాలన్నారు. చనిపోయిన, పెండిళ్లు అయిన వారి వివరాలను సమగ్రంగా తీసుకోవాలని కార్యదర్శులను ఆదేశించారు.

గూడూరులో..

గూడూరు : మండలంలో ముసాయిదా ఓటరు జాబితాపై మండలంలోని అన్ని రాజకీయ పార్టీల నాయకులతో ఎంపీడీవో వీరస్వామి గురువారం సమావేశం నిర్వహించారు. ఓటరు జాబితాలపై నాయకులతో చర్చించారు. ఈ సమావేశంలో ఎంపీవో సత్యనారాయణ పాల్గొన్నారు.

కేసముద్రంలో..

కేసముద్రం : ఓటరు జాబితాలో అభ్యంతరాలుంటే ఈ నెల 21లోపు సంబంధిత గ్రామ పంచాయతీ కార్యదర్శికి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయాలని ఎంపీడీవో ఉదయశ్రీ అన్నారు. గ్రామ పంచాయతీ ఎన్నికల ఓటరు జాబితాపై గురువారం మండల పరిషత్ కార్యాలయంలో అన్ని రాజకీయ పార్టీల నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. అభ్యంతరాలను పరిశీలించి ఈ నెల 28న తుది ఓటరు జాబితా ఇస్తామన్నారు. వివిధ పార్టీల నాయకులు అంబటి మహేందర్‌రెడ్డి, అల్లం నాగేశ్వర్‌రావు, నజీర్ అహ్మద్, నర్సింహారెడ్డి, కముటం శ్రీనివాస్, చాంగటి కిషన్, వెంకటాచారి పాల్గొన్నారు.

డోర్నకల్‌లో..

డోర్నకల్: గ్రామ పంచాయతీ ముసాయిదా ఓటరు జాబితాపై గురువారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీలతో ఎంపీడీవో శ్రీనివాస్‌రావు సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో మీర్జా మున్వర్‌భేగ్, బీఆర్ఎస్ నాయకుడు భిక్షంరెడ్డి, కాంగ్రెస్ నాయకుడు బత్తుల శ్రీనివాస్‌యాదవ్, బీఎస్పీ నాయకులు రజనీకాంత్ పాల్గొన్నారు.

నియామక పత్రాన్ని అందుకుంటున్న గోపి

మున్నూరు కాపు సంఘం జిల్లా ఇన్‌చార్జిగా గోపి

కేసముద్రం, సెప్టెంబర్ 19: ఉమ్మడి వరంగల్ జిల్లా మున్నూరు కాపు సంఘం ఇన్‌చార్జిగా మండలానికి చెందిన చందా గోపిని నియమించినట్లు రాష్ట్ర అపెక్స్ కౌన్సిల్ కన్వీనర్ పురుషోత్తంరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి సమావేశంలో చందా గోపికి మాజీ మంత్రి జోగు రామన్న నియామక పత్రాన్ని అందజేశారు. తన నియామకానికి కృషి చేసిన వారికి గోపి కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థులకు పోటీలు

గూడూరు, సెప్టెంబర్19 : మండలంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు స్వచ్ఛ హీ సేవా పోటీలను నిర్వహించి బహుమతులను ప్రదానం చేశారు. వ్యాస రచనలో బీ శేఖర్ (పొనుగోడు),డీ అనిల్ (అయోధ్యపురం) డ్రాయింగ్, పోస్టర్ మేకింగ్ బీ సావిత్రి (పొనుగోడు), డీ అంకిత (గూడూరు గర్ల్స్) , క్విజ్‌లో నాయక్ (పొనుగోడు), జీ నవ్యశ్రీ (అయోధ్యపురం) విద్యార్థులు ప్రథమ, ద్వితీయ బహుమతులు సాధించారు. వీరికి జిల్లా స్థాయిలో పోటీలను నిర్వహించనున్నట్లు ఏంఈవో శ్రీదేవి తెలిపారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు.

సౌండ్ బాక్స్‌లు స్వాధీనం చేసకున్న ఎస్సై సురేశ్

ఆకతాయిలకు కౌన్సెలింగ్

నర్సింహులపేట, సెప్టెంబర్ 19 : విద్యార్థినులను ఆకతాయిలు వేధిస్తున్నారనే సమాచారంతో గురువారం సాయంత్రం కొందరు పోలీసులు మఫ్టీలో వారికి జలక్ ఇచ్చారు. టీ షర్ట్‌లు ధరించి మామూలు వ్యక్తుల్లా నర్సింహులపేటలో తనిఖీలు చేశారు. ఏడు బైక్‌లు, ఆటోల్లో ఉన్న సౌండ్ బాక్స్‌లు స్వాధీనం చేసుకొని, ఆకతాయిలను పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లి కౌన్సెలింగ్ ఇచ్చారు. విద్యార్థినులపై అసభ్యంగా ప్రవర్తిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

'భూ సమస్యల పరిష్కారమే లక్ష్యం'

పెద్దవంగర, సెప్టెంబర్ 19 : భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా న్యాయ శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. మండలంలోని చిన్నవంగరలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. భూ సమస్యలు లేని గ్రామాలే లక్ష్యంగా న్యాయ శిబిరాలకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు.

ఫోర్జరీ కేసులో మాజీ సర్పంచ్ రిమాండ్

మహబూబాబాద్ రూరల్, సెప్టెంబర్ 19 : పోర్జరీ కేసులో మాజీ సర్పంచ్‌ను రిమాండ్ చేసిన ఘటన గురువారం మండలంలో జరిగింది. కురవి ఎస్సై సతీశ్ కథనం ప్రకారం.. ఇస్లావత్ తండా (ఎం) గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్ నరేశ్ జీపీ నిధులను రూ.49వేలను ఉప సర్పంచ్ రంగమ్మ సంతకాన్ని పోర్జరీ చేసి డ్రా చేసినట్లు ఆమె గతంలో ఫిర్యాదు చేశారు. పాత కేసుల విచారణ నేపథ్యంలో గురువారం నరేశ్‌ను పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చామన్నారు. కొంత సమయం తర్వాత టాయిలెట్‌కు అని బయటికి వెళ్లిన ఆయన తిరిగి పోలీస్‌స్టేషన్‌కు రాలేదని, దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పోలీసులు వేధిస్తున్నారు..

న్యాయం చేయాలని బాధితుల నిరసన

మహబూబాబాద్ రూరల్, సెప్టెంబర్ 19 : కురవి పోలీసులు అకారణంగా వేధిస్తున్నారని గురువారం రాత్రి పట్టణంలోని అంబేద్కర్ సెంటర్ వద్ద లంబాడా హక్కుల పోరాట సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భీమానాయక్ నిరసన వ్యక్తం చేశారు. తనతోపాటు తన కొడుకులు శివవర్మ, సూర్య ప్రకాశ్‌కు కురవి పోలీసులు ఎలాంటి కారణంగా లేకుండా ఇంటిపైకి వచ్చి బెదిరింపులకు గురిచేశారని, మీ కుటుంబం మొత్తాన్ని పోలీస్‌స్టేషన్‌లో ఉంచుతామని వేధిస్తున్నారని భీమానాయక్ పేర్కొన్నారు. ఎస్సీ వెంటనే స్పందించి న్యాయం చేయాలని కోరారు.

రైలు ఢీకొని గొర్రెల కాపరికి గాయాలు

ఐదు గొర్రెలు మృతి

కేసముద్రం, సెప్టెంబర్ 19: మండలంలోని తాళ్లపూసపల్లి– కేసముద్రం రైల్వే స్టేషన్ల మధ్య గుంటూరు నుంచి సికింద్రాబాద్ వెళ్లే గోల్కొండ ఎక్స్‌ప్రెస్ గురువారం ఢీ కొనడంతో గొర్రెల కాపరికి గాయాలు కాగా, ఐదు గొర్రెలు మృతి చెందాయి. స్థానికుల కథనం ప్రకారం.. మహబూబాబాద్ ముడుపుగల్ గ్రామానికి చెందిన గొర్రెల కాపరి కల్లెంచర్ల గంగమల్లు గొర్రెలను మేపడానికి వెళ్తున్నాడు. గొర్రెలు రైల్వే ట్రాక్ దాటుతున్న క్రమంలో గోల్కొండ ఎక్స్‌ప్రెస్ వచ్చి ఢీకొనగా ఐదు గొర్రెలు మృతి చెందాయి. గొర్రెల కాపరి గంగమల్లు గొర్రెలను తప్పించడానికి ప్రయత్నించే క్రమంలో రైలు ఢీకొని తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స కోసం 108 వాహనంలో ఏరియా హాస్పిటల్‌కు తరలించారు.

పేద యువతుల వివాహానికి ఫర్నిచర్ అందజేత

మరిపెడ, సెప్టెంబర్19 : పేద ముస్లిం కుటుంబాలకు చెందిన దమ్మాయిగూడెం, సూర్యపేటకు చెందిన మహబూబి, నాసియా వివాహం నిశ్చయం కాగా, వీరికి మరిపెడ హౌసింగ్ బోర్డులో స్థానికులు అండగా నిలిచారు. మసీద్ యే రహెమానియాకు చెందిన ఖలీద్, ఖాదర్, వసీం కలిసి రూ.50వేల విలువైన పెండ్లి సామగ్రిని గురువారం అందజేశారు. ఈ కార్యక్రమంలో తాజొద్దీన్, సర్వర్, లతీఫ్, సత్తార్, జహంగీర్, యాకూబ్ పాల్గొన్నారు.

సాధారణ కాన్పులు చేసేలా కృషి చేయాలి

నెల్లికుదురు, సెప్టెంబర్ 19 : ప్రభుత్వ దవాఖానల్లో సాధారణ కాన్పులు చేసేలా కృషి చేయాలని ఎంసీహెచ్ పీవో డాక్టర్ సారంగం అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. డాక్టర్లు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి వైద్యసేవలు అందజేయాలన్నారు. వైద్యులు శారద, నందినాదేవి, సిబ్బంది పాల్గొన్నారు.



నెల్లికుదురు పీహెచ్‌సీలో రికార్డులను పరిశీలిస్తున్న డాక్టర్ సారంగం

ఎఫ్ఎస్ఎన్ఎల్‌ను అమ్మేసిన కేంద్రం

రూ.320 కోట్లకు జపాన్ సంస్థకు విక్రయం

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 19: కేంద్ర సర్కార్ మరో ప్రభుత్వరంగ సంస్థను అమ్మేసింది. వాటాల విక్రయంలో భాగంగా ఫెర్రో స్క్రాప్ నిగం లిమిటెడ్(ఎఫ్ఎస్ఎన్ఎల్)ని జపాన్‌కు చెందిన కోనాయికీ ట్రాన్స్‌పోర్ట్ కో లిమిటెడ్‌కు రూ.320 కోట్లకు విక్రయించింది. స్టీల్ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న ఈ ఎఫ్ఎస్ఎన్ఎల్..ఎంఎస్‌టీసీ లిమిటెడ్‌కు చెందిన 100 శాతం సబ్సిడరీ సంస్థ. ఈ ఎఫ్ఎస్ఎన్ఎల్ విక్రయానికి కేంద్రం గతంలోనే నిర్వహించిన బిడ్డింగ్ ప్రక్రియకు రెండు బిడ్డింగ్‌లు టెక్నికల్‌గా అర్హత సాధించాయి. వీటిలో జపాన్‌కు చెందిన కోనాయికీ అత్యధికంగా రూ.320 కోట్ల బిడ్డింగ్ దాఖలుకు కేంద్ర మంత్రులు నితిన్ గడ్కరీ, నిర్మలా సీతారామన్, హెచ్‌డీ కుమార స్వామి నేతృత్వంలోని ప్రత్యేక కమిటీ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. రిజర్వు ధర రూ.262 కోట్లుకాగా, బిడ్డింగ్ రూ.320 కోట్లు దాఖలవడంతో దీనికి మొగ్గుచూపింది కేంద్రం. మరో బిడ్ ఇండిక్ జియో రిసోర్సెస్ ప్రైవేట్ లిమిటెడ్(చందన్ స్టీల్ లిమిటెడ్‌కు చెందిన సబ్సిడరీ సంస్థ) దాఖలు చేసినట్లు తెలిపింది. టోక్యో స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో లిస్టైన కోనాయిక్ ట్రాన్స్‌పోర్ట్ కో లిమిటెడ్. సంస్థకు స్టీల్ రంగంలో 140 ఏండ్లకు పైగా అనుభవం ఉన్నది. 1979 నుంచి ఎఫ్ఎస్ఎన్ఎల్ స్టీల్ మిల్ సేవలను అందిస్తున్నది. పలు స్టీల్ ప్లాంట్ల నుంచి సేకరించిన స్క్రాప్ స్టీల్‌ను తిరిగి వినిమయంలో తెస్తున్నది సంస్థ.

హైదరాబాద్‌లో అల్ట్రావయలెట్

హైదరాబాద్, సెప్టెంబర్ 19: ప్రముఖ ఎలక్ట్రిక్ వాహన మోటార్‌సైకిళ్ల తయారీ సంస్థ అల్ట్రావయలెట్... తాజాగా రాష్ట్రంలోకి అడుగుపెట్టింది. హైదరాబాద్‌లో తన తొలి షోరూంను గురువారం ప్రారంభించింది. దీంతో సంస్థకు ఇది ఐదో షోరూం కావడం విశేషం. ఈ సందర్భంగా కంపెనీ సీఈవో, కో–ఫౌండర్ నారాయణ్ సుబ్రమణియమ్ మాట్లాడుతూ.. వ్యాపార విస్తరణలో భాగంగా హైదరాబాద్‌లో అడుగుపెట్టినట్లు, ఈ ఏడాది చివరినాటికి మొత్తం అవుటిలెట్ల సంఖ్యను పదికి పెంచుకోబోతున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో అధిక మైలేజీని కోరుకుంటున్నవారిని దృష్టిలో పెట్టుకొని తొలి మాడల్ ఎఫ్77ని అందుబాటులోకి తీసుకొచ్చినట్లు చెప్పారు. ఈ బైకు సింగిల్ చార్జింగ్‌తో 320 కిలోమీటర్ల మైలేజీ ఇవ్వనున్నదన్నారు. దీంట్లో 7.1 కిలోవాట్లా బ్యాటరీ కలిగిన మాడల్ ధర రూ.2.99 లక్షలుగాను. 10.1 కిలోవాట్లా బ్యాటరీ మాడల్ రూ.3.99 లక్షలుగా నిర్ణయించింది. మరోవైపు, శుక్రవారం సంస్థ గంటకు 265 కిలోమీటర్ల వేగంతో దూసుకుపోయే ఎఫ్99ని స్పోర్ట్స్ బైకును ఆవిష్కరించనున్నట్లు చెప్పారు. వచ్చే 2–3మూడేండ్లలో మరో 3–4 మాడళ్లను దేశీయ మార్కెట్లోకి విడుదల చేయనున్నట్లు ప్రకటించిన ఆయన... ఈ బైకులపై ఎనిమిదేండ్లు లేదా 8 లక్షల కిలోమీటర్ల వ్యారెంటీ కల్పిస్తున్నది.

సేల్స్‌ఫోర్స్ విస్తరణ

శాన్ ఫ్రాన్సిస్కో, సెప్టెంబర్ 19: కస్టమర్ రిలేషన్‌షిప్ మేనేజ్‌మెంట్ సేవల సంస్థ సేల్స్‌ఫోర్స్..భారత్‌లో తన వ్యాపారాన్ని శరవేగంగా విస్తరిస్తున్నది. హైదరాబాద్‌తోపాటు బెంగళూరులలో ఉన్న సెంటర్లను ఆధునీకరించడానికి మరిన్ని పెట్టుబడులు పెట్టబోతున్నట్లు కంపెనీ చీఫ్ ఆపరేటింగ్ అధికారి బ్రియాన్ మిల్హమ్ తెలిపారు. మరోవైపు, కంపెనీ దేశీయ హెడ్ అరుంధతీ భట్టాచార్య మాట్లాడుతూ..భారత్‌లో ఉద్యోగుల సంఖ్యను గడిచిన రెండేండ్లలో రెండింతలు పెంచినట్లు, ప్రస్తుతం 13 వేల మంది విధులు నిర్వహిస్తున్నారని, మరింత మందిని తీసుకునే అవకాశాలున్నట్లు చెప్పారు.

హెరిటేజ్ ఐస్‌క్రీం ప్లాంట్

హైదరాబాద్, సెప్టెంబర్ 19: ప్రముఖ పాల ఉత్పత్తుల సంస్థ హెరిటేజ్ ఫుడ్స్ లిమిటెడ్..తాజాగా తెలంగాణలో ఐస్‌క్రీం ప్లాంట్‌ను ఏర్పాటు చేయబోతున్నట్లు ప్రకటించింది. షామీర్‌పేట్‌లో రూ.204 కోట్ల పెట్టుబడితో నెలకొల్పబోతున్నట్లు తెలిపింది. ఈ ప్లాంట్ ఏర్పాటునకు సంబంధించి కంపెనీ బోర్డు డైరెక్టర్లు సమావేశమై గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. తెలుగు రాష్ట్రాల్లో ఐస్‌క్రీంకు పెరుగుతున్న గిరాకీని దృష్టిలో పెట్టుకొని ఈ యూనిట్‌ను నెలకొల్పాలని నిర్ణయించినట్లు, వచ్చే ఏడాది నవంబర్ నాటికి ఈ యూనిట్ అందుబాటులోకి రానున్నట్లు కంపెనీ వర్గాల వెల్లడించాయి.

వాణిజ్య

టప్పర్‌వేర్ దివాలా

ఆర్థిక సంక్షోభంలో ప్లాస్టిక్ కిచెన్‌వేర్ దిగ్గజం • అమెరికా కోర్టులో పిటిషన్ దాఖలు

తగ్గిన గిరాకీ, పెరిగిన పోటీతో కుదేలు • రూ.10వేల కోట్ల రుణ భారం

న్యూయార్క్, సెప్టెంబర్ 19: ప్రముఖ ప్లాస్టిక్ కిచెన్‌వేర్ బ్రాండ్ టప్పర్‌వేర్ దివాలా తీసింది. అమెరికా బ్యాంకర్‌ప్సీ కోర్టులో చాప్టర్ 11 బ్యాంకర్‌ప్సీ రక్షణను కోరుతూ పిటిషన్‌ను దాఖలు చేసింది. ఆహార పదార్థాల నిల్వలో విప్లవాత్మక మార్పులను తీసుకొచ్చిన ఈ సంస్థ.. ప్రస్తుత మార్కెట్‌లో నెలకొన్న పోటీని తట్టుకోలేక చతికిలపడింది. పర్యావరణ పరిరక్షణపై పెరిగిన అవగాహన, ప్లాస్టిక్ వినియోగంపై మారుతున్న కస్టమర్ల అభిప్రాయాలు సైతం టప్పర్‌వేర్ అమ్మకాలకు గండి కొట్టాయి.

80 ఏండ్ల కిందట..

అమెరికాలోని ఫ్లోరిడాలోగల ఓర్లాండో ప్రధాన కేంద్రంగా 1942లో టప్పర్‌వేర్ బ్రాండ్‌ను ఎర్ల్ టప్పర్ స్థాపించారు. 1946లో మార్కెట్‌కు వీటి ఉత్పత్తులు పరిచయమయ్యాయి. అప్పట్నుంచి టప్పర్‌వేర్ ఉత్పత్తులకు ప్రపంచవ్యాప్తంగా ఆదరణ పెరుగుతూ వచ్చింది. కానీ మార్కెట్‌లో పెరిగిన పోటీతో అమ్మకాలు తగ్గుముఖం పట్టడం ప్రారంభమైంది. క్లీనెక్స్, టెఫ్లాన్, ఇతర బ్రాండ్ల దూకుడు ముందు టప్పర్‌వేర్ నిలదొక్కుకోలేకపోయింది. ఇక డైరెక్ట్ సేల్స్ నుంచి వినియోగదారులు దూరం జరుగడం కూడా సంస్థ వ్యాపారాన్ని దెబ్బతీసిందని దివాలా పిటిషన్‌లో టప్పర్‌వేర్ పేర్కొన్నది.

పీకల్లోతు అప్పులు

దివాలా పిటిషన్ ప్రకారం టప్పర్‌వేర్‌పై రూ.10,000 కోట్ల (1.2 బిలియన్ డాలర్లు) రుణ భారం ఉన్నది. రుణదాతలతో చేసుకున్న ఒప్పందాలనూ ఇది మీరినట్టు తెలుస్తున్నది. అయితే సుమారు రూ.5,700 కోట్ల (679.5 మిలియన్ డాలర్ల) ఆస్తులు కూడా ఉన్నట్టు కంపెనీ చెప్తున్నది. ఇక ప్రస్తుతం సంస్థ ఉద్యోగుల సంఖ్య 5,500. భారత్‌తోపాటు 41 దేశాల్లో వీరంతా పనిచేస్తున్నారు. 4.65 లక్షల కన్సల్టెంట్లూ ఉన్నారు. ఫ్రీలాన్స్ బేసిస్‌లో దాదాపు 70 దేశాల్లో టప్పర్‌వేర్ ఉత్పత్తులను అమ్ముతున్నారు.

భారత్‌లో యథాతథంగానే..

అమెరికా దివాలా కోర్టులో పిటిషన్ దాఖలు చేసినప్పటికీ.. భారత్‌లో టప్పర్‌వేర్ అమ్మకాలు యథాతథంగానే సాగుతాయని సంబంధిత వర్గాల నుంచి అందుతున్న సమాచారం. దేశీయంగానే టప్పర్‌వేర్ ఉత్పత్తుల తయారీ జరుగుతున్నది కాబట్టి.. అంతర్జాతీయ మార్కెట్‌లో తలెత్తిన ఇబ్బందులు ఇక్కడ ప్రభావం చూపబోవని వారంటున్నారు. అంతేగాక మునుపటిలాగే విస్తరణ ఉంటుందని, కస్టమర్ల అభిరుచులకు తగ్గట్టుగా నాణ్యమైన ఉత్పత్తులను మార్కెట్‌లోకి తెస్తామని చెప్తున్నారు. ఇప్పటికే గ్లాస్, స్టీల్ ఉత్పత్తులనూ టప్పర్‌వేర్ బ్రాండ్ అమ్ముతున్న విషయం తెలిసిందే.

'దివాలా ప్రక్రియ అంటే సంస్థ మనుగడకు కావాల్సిన వెసులుబాట్లను కల్పించడమే. ఈ కంపెనీ ఎక్కడికీ పోదు. ఎప్పట్లాగే ఇకపైనా మా నాణ్యమైన ఉత్పత్తులు మార్కెట్‌లో లభిస్తాయి'

-లారీ అన్ గోల్డ్‌మన్, టప్పర్‌వేర్ అధ్యక్షుడు, సీఈవో

దేశానికే ఆదర్శంగా స్కిల్ వర్సిటీ

- **కంపెనీలు, పారిశ్రామికవేత్తలు భాగస్వాములవ్వాలి: సీఎం రేవంత్**
- **దసరా తర్వాత కోర్సులు ప్రారంభం**

స్కిల్ యూనివర్సిటీపై సచివాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతున్న సీఎం రేవంత్ రెడ్డి. చిత్రంలో మంత్రి శ్రీధర్ బాబు, వర్సిటీ చైర్మన్ ఆనంద్ మహీంద్రా

హైదరాబాద్, సెప్టెంబర్ 19 (నమస్తే తెలంగాణ): తెలంగాణ యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీని దేశంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆకాంక్షించారు. రాష్ట్రంలోని పారిశ్రామికవేత్తలు, ప్రముఖ కంపెనీలు ఈ యూనివర్సిటీలో భాగస్వాములవ్వాలని, యువతకు నైపుణ్యాలను పెంచి.. వారికి ఉపాధి కల్పించేందుకు తమవంతు సహకారం అందించాలని పిలుపునిచ్చారు. యూనివర్సిటీ బోర్డుతోపాటు రాష్ట్రంలోని వివిధ రంగాలకు చెందిన పారిశ్రామికవేత్తలు, కంపెనీల ప్రతినిధులతో గురువారం సచివాలయంలో సీఎం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. వర్సిటీకి రాష్ట్ర ప్రభుత్వం తరపున 150 ఎకరాల స్థలంతోపాటు రూ.100 కోట్లు కేటాయించామన్నారు. రాష్ట్రంలోని పారిశ్రామికవేత్తలు యూనివర్సిటీ నిర్వహణ కోసం కార్పస్ ఫండ్ ఏర్పాటుకు, భవనాల నిర్మాణానికి ముందుకు రావాలని కోరారు. బోర్డు చైర్మన్‌గా ఆనంద్ మహీంద్రా యూనివర్సిటీకి బ్రాండ్ ఇమేజీని తీసుకువస్తారనే నమ్మకాన్ని వ్యక్తం చేశారు. అలాగే ఇకపై తమ ప్రభుత్వం యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటుపై దృష్టి సారిస్తుందన్నారు. దాదాపు 200 ఎకరాల్లో స్పోర్ట్స్ యూనివర్సిటీని నెలకొల్పి.. 2028 ఒలింపిక్స్‌లో దేశానికి గోల్డ్ మెడల్ తీసుకురావాలనే లక్ష్యంతో క్రీడాకారులకు శిక్షణను అందిస్తామన్నారు. ఇందుకోసం రూ.వెయ్యి కోట్లు ఖర్చు చేసేందుకైనా సిద్ధంగా ఉన్నట్టు తెలిపారు. ఆనంద్ మహీంద్రా మాట్లాడుతూ.. ప్రపంచానికి నైపుణ్యమున్న యువతను అందించే గమ్యస్థానంగా తెలంగాణ నిలబడుతుందనడంలో సందేహం లేదన్నారు. కాగా, దసరా తర్వాత కోర్సులను ప్రారంభించనున్నట్టు బోర్డు సూచనప్రాయంగా వెల్లడించింది. తొలి ఏడాది 2వేల మంద